# ఆర్టిసి కార్మికుల సేవలు ప్రశంసనీయం




-ఆర్టిసి సిబ్బందికి వాటర్ బాటిల్స్ పంపిణీ చేసిన కలెక్టర్

2 లో


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శుక్రవారం | 28 | మార్చి | 2025 పేజీలు 7









# నిబంధనలకు పాతర..!

- అధికారుల హెచ్చరికలు బేఖాతర్
- నిలువునా 'కూలి'న బతుకులు
- శిథిలాల నుండి ఒక మృతదేహం వెలికితీత
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- వెలికితీతల్లో నగదు, బంగారు, వెండి ఆభరణాలు లభ్యం
- మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి : సాబీర్‌పాషా

2 లో

**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణం నడిబొడ్డు అతి పెద్ద ఆరు అంతస్తుల భవనం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమవుతూ కుప్పకూలింది. నిబంధనలకు పాతరేసిన భవన నిర్మాణదారుడు తన ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ అధికారులపై బెదిరింపులకు పాల్పడుతూ, పలుకుబడిని ఉపయోగించి చట్టాలను చేతిలోకి తీసుకున్నాడు. దీంతో కూలీ పనులకు వచ్చిన కార్మికులు కుప్పకూలిన భవన శిథిలాల్లో నలిగిపోయిన ప్రాణాలు కోల్పోయారు. ఆరు అంతస్తుల భవనం ఒక్క సారిగా పేకమేడలా కూలిపోవడంతో అక్కడ పరిస్థితి

మిగతా 2లో..

## ఉపాధి హామీ

# పనుల్లో అవినీతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఉపాధి హామీ పథకంలో భారీ అవినీతి జరిగిందంటూ అధికార పార్టీ నాయకులతో పాటు ఉపాది హామీ కూలీలు గ్రామసభలో అవినీతి బాగోతాన్ని బట్టబయలు చేశారు. సత్తుపల్లి నియోజకవర్గం,

మిగతా 2లో..

- -పనులు చేయకుండా, తక్కువ పనికి ఎక్కువ బిల్లులు
- -కార్డు ఒకరిది, పని మరొకరిది.. డబ్బులు ఇద్దరికి...
- -ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న ఈజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ లీలలు
- -నాటి అధికార పార్టీ నాయకులతో కలిసి అవినీతికి తెర

# రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా బాగం ఎన్నిక

-రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులుగా తిరిగి బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. నిజామాబాద్‌లో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో హేమంతరావును తిరిగి రెండవ సారి రాష్ట్ర అధ్యక్షునిగా మహాసభ ఎన్నుకుంది. నేలకొండపల్లి మండలం ముటాపురం గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన హేమంతరావు విద్యార్థి, యువజన ఉద్యమాలలో చురుకైన పాత్ర నిర్వహించారు. విద్యార్థి సంఘం (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షునిగా, కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా పని చేసిన హేమంతరావు సుదీర్ఘ కాలం సిపిఐ ఉమ్మడిజిల్లా కార్యదర్శిగా అవశేష ఖమ్మంజిల్లా కార్యదర్శిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా,జాతీయ సమితి సభ్యులుగా పనిచేస్తున్నారు. రైతాంగ సమస్యలపై ప్రత్యేకించి వ్యవసాయ రంగంపై పూర్తి అవగాహన కలిగిన హేమంతరావు రైతు సంఘం

మిగతా 2లో..



# నిబంధనలకు పాతర..!







(మొదటిపేజీ తరువాయి)

భయానకంగా మారింది. భవన నిర్మాణం జరుగుతున్న క్రమంలో స్థానిక గ్రామ పంచాయితీ అధికారులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వాటిని ఏ మాత్రం పట్టించుకోని నిర్మాణ దారుడు ఇష్టాను సారంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. గత కొన్ని రోజుల క్రితం గ్రామపంచాయితీ ఇఓ భవనం పై వరకు వెళ్లి పనులు నిలుపుదల చేయాలని హెచ్చరించినప్పటికీ నిర్మాణానికి ఎలాంటి ఆంటకం కలిగించవద్దని కొందరు అధికారులకు తెలిపినట్లు సమాచారం. వెరసి కార్మికులు నిండు ప్రాణాలు బలై పోయాయి. ఘటనా స్థలంలో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. శిధిలాలను ప్రొక్లైన్ సహకారంతో తొలగిస్తున్నారు. గురువారం తెల్లవారుఝామున కొన ఊపిరితో ఉన్న కామేశ్వరరావు(48) అనే కార్మికున్ని వెలికి తీశారు. బయటకు తీసి హుటాహుటిన ఆక్సిజన్ ఎక్కించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆ కార్మికుడు మృత్యు వాత పడ్డాడు. మృతిని వృద్ధురాలైన తల్లి ఉంది. తనకు దిక్కుగా ఉన్న ఒక్కగానొక్క కుమారున్ని కోల్పోయిన తల్లి రోదిస్తున్న తీరు పలువురుని కంటతడి పెట్టించింది. ఇంకా శిథిలాల క్రింద ఉపేందర్ అనే మరో సుతారీ మేస్త్రి ఉన్నాడు. డాగ్ స్క్వాడ్ లోనికి వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేయడంతో ఆ డాగ్ లోనికి వెళ్లి నిశబ్దంగా తిరిగి వచ్చింది. మనిషులు బ్రతికి ఉంటే కుక్క అరుస్తుందని, అరవలేదంటే మృతు చెందినట్లు నిర్ధారించినట్లు అని నిపుణులు అంటున్నారు. కుప్పకూలక ముందు పనిజరిగే సమయంలో ఇద్దరు మేస్త్రీలతో పాటు మరో నలుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గిరిజన కూలీలు ఉన్నట్లు చెబుతున్నారు. వారు ఉంటే మృతుల సంఖ్య ఆరుకు పెరిగే అవకాశం ఉంది. మరో కార్మికుడు ఉపేందర్ కుటుంబ సభ్యులు ఆయన సజీవంగా బయటకు రావాలని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అక్కడి పరిస్థితిని చూస్తే బ్రతుకుండే అవకాశాలు లేవని తెలిసినప్పటికీ వారు పడుతున్న తపన అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఉపేందర్ కుటుంబీకులు, బంధు వర్గాలు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాయకష్టం చేసుకుని భార్య పిల్లలను పోషించుకుంటున్నాడని, పిల్లలు చదువుతున్నారని, ఇప్పుడు ఆ పిల్లలు,భార్య బ్రతుకులు రోడ్డున పడ్డాయని రోదిస్తున్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదారుస్తున్నారు.

**భారీగా బంగారం, నగదు లభ్యం...**

శిధిలాలను తొలగించే క్రమంలో భారీగా బంగారు, వెండి ఆభరణాలతో పాటు పెద్ద ఎత్తన నగదు లభ్యమైంది. భవన క్రింది గదిలో ఉన్న బీరువాలో ఆభరణాలు,నగదు ఉన్నాయి. వాటిని బయటకు తీసిన పోలీసులు పంచనామా నిర్వహించి వెంటనే ట్రాక్టర్‌లో వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం, నగదు లభ్యం కావడంతో అంతా ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇంకా వెతికి తీస్తే మరి కొంత లభ్యమయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ట్రస్ట్ పేరిట పెద్ద ఎత్తున నగదును వసూళ్లు చేశారని, బంగారు ఆభరణాలు కూడబెట్టారని ప్రజలు అంటున్నారు.

**కుటుంబాలను ఆదుకోవాలి: సాబీర్ పాషా**

ఆరంతస్తుల భవనం కుప్పకూలి కార్మికులు మృతి చెందారని, ఆ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ప్రమాదానికి గల కారణాలపై తగిన విచారణ జరిపించి. ఒక్కొక్క కుటుంబానికి రూ.50 లక్షల పరిహారాన్ని ఇవ్వాలన్నారు.

# రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా బాగం ఎన్నిక







(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షునిగా ఎన్నిక కావడం అభినందనీయం. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పక్షాన రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచర ణతో ముందుకు సాగుతామన్నారు. మోడీ పాలనలో వ్యవసాయ రంగం విపత్కకు గురైందని రైతాంగ ఉద్యమాలను అణిచివేసేందుకు తప్ప సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రయ త్నించడం లేదని ఆయన ఆరోపించారు. వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు గిట్టుబాటు ధర కోసం వ్యవసాయోత్పత్తులకు మార్కెటింగ్ కల్పన కోసం వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నేతృత్వంలో పోరాడతామని హేమంతరావు తెలి పారు. ఖమ్మంజిల్లా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు దొండపాటి రమేష్, సీనియర్ నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక పట్ల పలువురు అభినంద నలు తెలిపారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా తొండపు

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది తొండపు వెంకటేశ్వరరావు గెలుపొందారు. తల్లాడ మండలం వెంగళపేట గ్రామా నికి చెందిన వెంకటేశ్వరరావు సాధారణ రైతు కుటుంబానికి చెందిన వాడు. న్యాయశాస్త్రంలో నాగార్జున యూనివర్సిటీ నుండి 1990లో లా పట్టా పొందినాడు. అదే సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకున్నారు. ఖమ్మంకు చెందిన సీనియర్ న్యాయవాది బోడే పూడి వెంకటేశ్వరరావు దగ్గర జూనియర్‌గా పనిచేశాడు. గురువారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 816 ఓట్లకు గాను 717 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధి కారి ప్రకటించారు. అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీ పడగా ఇద్దరి మధ్యనే ప్రధాన పోటీ జరి గింది. అధ్యక్షునిగా తొండపు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్ష పదవికి విజయశాంత, ప్రధాన కార్య దర్శిగా గద్దల దిలీప్‌కుమార్, క్రీడా కార్యదర్శిపదవికి గాను కెవివి లక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శి పదవికి గాను రాంబాబు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సర్వదేవభట్ల సోమశేఖరశర్మ ప్రకటిం చారు. ఫలితాల అనంతరం న్యాయవాదులు సంబరాలు చేసుకున్నారు. నూతన కార్యవర్గానికి సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గం న్యాయవాద సమస్యల పట్ల అంకిత భావంతో పని చేస్తామని తెలిపారు. జాయింట్ సెక్రటరీ పోస్టుకు మేకల నవీన్‌కుమార్, ట్రెజరర్ పోస్టుకు పి. నర్సింహారావు, మహిళా ప్రతినిధిగా పి. ఇందిరాలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

# ఉపాధి హామీ పనుల్లో అవినీతి



(మొదటిపేజీ తరువాయి)

వేంసూరు మండలం, వెంకటాపురం గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఉపాది హామీ కూలీలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను ఏకరవు పెట్టారు. ఉపాది హామీ పనుల్లో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని, నిధుల దుర్వినియోగం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గత అధికార పార్టీ నాయకులు నియమించు కున్న, ఆ పార్టీ సానుభూతిపరులు అక్రమాలు చేశారన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, నిధుల దుర్విని యోగం జరుగుతోందని, అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతు న్నారని గతంలో తాము లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా అధికా రులు పట్టించుకోలేదని మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ నాయకులకు ఉపాది హామీ పథకం జేబులు నింపే కల్పతరువుగా మారిందని ఎంపిడిఓకు సాక్ష్యాధారాలతో సహా వివరించి చూపారు. ఉపాధి హామీ పథకంలో అవినీతి జరుగుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మాయాజాలం పెరిగి పోయిందని పనులు చేయకుండానే బిల్లులు చేశారని, ఓచోట చెరువులో 60 క్యూబిక్ మీటర్ల పనులు జరగగా 90 క్యూబిక్ మీటర్ల పనులు చేసి నట్లు చూపించి రూ.5 వేలు తమ ఖాతాలలో జమ చేసుకున్నారని ఆరో పించారు. ఏపీఓల సంతకాలు లేకుండానే మస్టర్లు వచ్చాయని ఇదెలా సాధ్యమన్నారు. ఉపాధి హామీలో జరిగిన అవక తవకలపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విష యంపై ఎంపీడీఓను విచారణ కోరగా జరిగిన విషయాలను ఉన్నతాధి రుల దృష్టికి తీసుకెళ్లి డిఆర్డిఓ కు నివేదిస్తామని తెలిపారు.

# ఆర్టిసి కార్మికుల సేవలు ప్రశంసనీయం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజల జీవన వ్యవస్థ సజావుగా జరిగేందుకు కృషి చేస్తున్న ఆర్టిసి కార్మికుల సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కొనియాడారు. గురువారం ఖమ్మం బస్సు డిపోలో ఆర్టిసి సిబ్బందికి జిల్లా కలెక్టర్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ శరీరంలో రక్తం ఎంత ముఖ్యమో ప్రజలకు సేవలు అందించే ఆర్టిసి కూడా అంతే ముఖ్యమని, ప్రజలకు చాలా సేవలను ఆర్టిసి కార్మికులు అందిస్తున్నారన్నారు. వీరి కృషి ఫలితంగా నేడు విద్యార్థులకు విద్య, మహిళలకు ఉపాధి అవకా శాలు, ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందుతున్నాయని ఈ సందర్భంగా వారికి ధన్యవా దాలు తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు చాలా కష్టపడి పని చేస్తున్నారని ప్రస్తుత వేసవి కాలంలో వారికి ఉపయోగపడేవిధంగా జిల్లా యంత్రాంగం తరుపున 650 వాటర్ బాటిల్స్ పంపిణీ చేస్తు న్నామన్నారు. ఆర్టిసి కార్మికుల పిల్లల చదువులు, డిపోలో ఇతర సౌకర్యాలు, ఇబ్బందులను తమ పరిధి మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సమాజంలో మనం ఎంత బాగా పని చేసినా గుర్తింపు రాదని, మనం లేని సమయంలో ఆ లోటు బాగా తెలుస్తుందన్నారు. అటువంటి విభాగాల్లో ఆర్టిసి ఒకటన్నారు. ఆర్టిసి కార్మికులకు ఉన్న సమస్యలను డిపో మేనేజర్‌కు అందిం చాలని జిల్లా పరిధిలో పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఆర్టిసి కార్మికులందరికీ ఫైనాన్షియల్ ప్లానింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ప్రత్యేకంగా పంపి శిక్షణా తరగతుల ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. మహిళా కండక్టర్లు, సిబ్బం దికి మార్గ మధ్యలో ఉన్న అవసరం ఉన్నచోట పెట్రోల్ బంక్‌లలో ప్రత్యేకంగా మరుగుదొడ్ల ఏర్పా టుకు ప్రతిపాదనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్, మెకానికల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, డిపో మేనేజర్ దినేష్‌కుమార్, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, సంబం ధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుల గణన రెమ్యూనరేషన్ చెల్లించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కుల గణన సర్వేకు సంబంధించి రెమ్యూ నరేషన్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పిఆర్‌టియు రఘునాథ పాలెం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కేశవరావు, తుమాటి సైదు బాబు తెలిపారు. గురువారం పిఆర్‌టియు రఘునాథపాలెం మండల శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతే దాది నవంబర్ నెలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుటుంబ కుల గణన సర్వే నిర్వహించిందని వారు తెలిపారు. ఈ సర్వే నిర్వహిం చడానికి ఉపాధ్యాయులను, ఇతర శాఖల ఉద్యోగులను ఎన్యూమరేట ర్లుగా, సూపర్‌వైజర్లుగా నియమించి రూ. 10 వేలు రెమ్యూనరేషన్ ప్రక టించి 15 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించిందని వారు తెలి పారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఉపాధ్యాయులు సెలవులు, పండుగ రోజుల్లో కూడా సర్వే విధులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. సర్వే పూర్తి చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించిన రెమ్యూనరేషన్ అందించకపోవడం బాధాకరమన్నారు. గతంలో ఎన్నడులేనివిధంగా ఏకంగా ఐదు డిఏలను పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. జిపిఎఫ్ బకాయిలు గత ఏప్రిల్ నుండి టిఎస్ జిఎల్ఐ బకాయిలు 2023 సెప్టెంబర్ నుండి పెండింగ్‌లో ఉన్నాయ న్నారు. గతేడాది పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయుల పారితోషికం ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. వెంటనే రెమ్యూనరేషన్, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోమ్లానాయక్, సతీష్, ఎండి జబ్బార్, రంగారావు, తిరుపతిరావు, చందన, సురేష్, వెంకటకిషోర్, మహతి, కోటేశ్వరరావు, ఉపేందర్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా కాంపల్లి

**ప్రజాపక్షం/ఇల్లందు:** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు 202526సంవత్సరానిక కిగాను జరిగిన హోరాహోరీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కాంపల్లి ఉమామహేశ్వర్‌రావు గెలుపొం దారు. గురువారం జరిగిన ఇల్లందు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పదవిలో త్రిముఖ పోరు నెలకొనగా అధ్యక్షుడిగా కాంపల్లి ఉమామహేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కీర్తికార్తిక్, ఉపాధ్యక్షుడిగా ఎస్.కె.ఎం.డి.కాసిం, సంయుక్త కార్యదర్శిగా సీ.హెచ్.నవీన్‌కుమార్, కోశాధికా రిగా మూడు వినోద్ గెలుపొందారు. కకోర్టు ఆవరణలో గెలుపొందిన అభ్యర్థులు గెలుపుకు సహ కరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపి అనంతరం మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసు కున్నారు. ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవాదులు ఎన్.చెన్న కేశవరావు, దంతాల ఆనంద్ వ్యవహరించారు.

# సంస్థాగత బలోపేతమే లక్ష్యం

**-ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు**
**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**







**ప్రజాపక్షం/ఖమ్మం :** పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం రూరల్ మండలం పెద్దతండ, నాయుడుపేట, జలగంనగర్ సిపిఐ శాఖ మహాసభలు బానోత్ దేవా, రావుల శ్రీను, రావూరి రామచంద్రయ్య అధ్యక్ష వర్గంగా జరిగాయి. మహాసభకు ముందు పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు బానోత్ చందానాయక్ ఆవిష్కరించారు. సభలో దండి సురేష్ మాట్లాడుతూ ఇది మహాసభల సంవత్సరమని గ్రామశాఖ నుంచి జాతీయ స్థాయి వరకు మహాసభలు నిర్వహించుకుని నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకునే స్థితిలో లేవని సురేష్ తెలిపారు. దేశంలో సంపద పోగుపడుతుందని ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని ఈ స్థితికి కారణం కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. కార్పొరేట్, సంపన్న వర్గాల అనుకూల విధానాలు అవలంభిస్తున్నారని దీనితో పేద, మధ్యతరగతి ప్రజలు బతకలేని స్థితి ఏర్పడుతుందన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఐటి, ఈడి దాడులతో పాటు కేసులు పెట్టి వేధిస్తున్నారని సురేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ప్రకటించినవిధంగా ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా మాట్లాడుతూ నేటి యువతను మతం మత్తులో ఉంచాలని బిజెపి ప్రయత్నిస్తుందని మెజార్టీ, మైనార్టీ ప్రాతిపదికన మతం అడ్డుగా బిజెపి తన కుటిల యత్నాలను సాగిస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన బిజెపి కార్పొరేట్ శక్తులకు మాత్రం కోట్ల రూపాయల రాయితీలను ప్రకటిస్తుందని ఆయన ఆరోపించారు. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విధానం సరైంది కాదని ఎన్నికలకు ముందు చెప్పినట్లుగా రెండు లక్షల పైబడిన రైతులకు కూడా రుణమాఫీ చేయాలని మౌలానా డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించకపోతే తగిన ఫలితం అనుభవించక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సభలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సిపిఐ మండల నాయకులు పొల్తియా శ్రీను, సురేందర్, దండి రంగారావు, గడ్డా నాయక్, బద్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభల్లో పెద్దతండ శాఖ కార్యదర్శిగా బానోత్ దేవా, సహాయ కార్యదర్శులుగా గుగులోత్ కిరణ్, మూడు శ్రీను, భూక్యా రవి, నాయుడుపేట కార్యదర్శిగా రావుల శ్రీను, సహాయ కార్యదర్శిగా మలిశెట్టి శ్రీనివాస్, రాజు లు ఎన్నికయ్యారు.

# వ్యాపార విస్తరణ దిశగా అడుగులు వేయాలి

**-ఖమ్మం నగరంలో**
**విజయ డెయిరీ పార్లర్‌ను**
**ప్రారంభించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వ్యాపార విస్తరణ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ ఖమ్మం నగరం బుర్హాన్ పురం పాత డిఆర్‌డివో ఆఫీస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా విజయ డెయిరీ పార్లర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు నాణ్యమైన పాల పదార్థాలు విక్రయిస్తూ మంచి లాభాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మధిరలో ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు చేశామని విజయ డెయిరీతో సమన్వయం చేసుకుంటూ పాడి రైతుల నుంచి పాల సేకరణ చేసి సరఫరా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. డెయిరీ పార్లర్ నిర్వాహకులకు అవసరమైన శిక్షణ అందించేందుకు సహకారం అందిస్తామన్నారు. వేసవి కాలం దృష్ట్యా వ్యాపారాభివృద్ధిలో భాగంగా మిల్క్‌షేక్, ఫాలుదా, పండ్ల రసాలు వంటివి విక్రయించేందుకు గల అవకాశాలు పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. పాలను ఉపయోగించి నాణ్యమైన లస్సీ తయారు చేసి విక్రయిస్తే అధిక లాభాలు వస్తాయని ఆ దిశగా ఆలోచనలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ డిడి మోహన్ మురళి, డిస్ట్రిబ్యూటర్లు నరేష్, జగదీష్, విజయ డెయిరీ పార్లర్ నిర్వాహకులు మదార్ తదితరులు ఉన్నారు.

# పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ







**ప్రజాపక్షం/ మధిర :** రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని గురువారం స్థానిక షాదీఖానాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర తహశీల్దార్ ఆర్.రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం కుటుంబాలకు రంజాన్‌తోఫాను పంపిణీ చేశారు. అనంతరం ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షులు మౌలానా షేక్‌ముజాహిద్ మాట్లాడుతూ ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో మధిర నియోజకవర్గస్థాయిలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముస్లింలందరూ ఐక్యమత్యంగా ఉంటూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. మధిర పట్టణం, మండలంలోని సుమారు 800మంది పేద ముస్లింలకు రంజాన్‌తోఫాను అందించటం జరిగిందని తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని ముస్లింలందరూ భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు జనాబ్ షేక్‌హుస్సేన్, ప్రధానకార్యదర్శి జనాబ్ షేక్‌మొహమ్మద్‌గౌసుద్దీన్, కోశాధికారి జనాబ్ షేక్.నాగుల్‌మీరా, కార్యదర్శులు, ముస్లిం పెద్దలు, సోదర, సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వాతావరణం మెరుగు కోసం కృషి చేస్తా



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విద్యా వాతావరణం మెరుగుపరుచటం కోసం తమ సంస్థ కృషి చేస్తుందని కోరమండల్ మన గ్రోమోర్ సంస్థ వరంగల్ డీజీఎం సానికొమ్ము శ్రీనివాసరెడ్డి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రాజేశ్వరపురం ప్రభుత్వ పాఠశాలకు రూ.3 లక్షల సహాయం తో బెంచీలను అందించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ చదువులతో మెరుగైన ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాల లో చదివే విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండి సమాజం కు గొప్ప మార్గదర్శకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సంస్థ తరుపున విద్యాభివృద్ధి కి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, మండల వ్యవసాయాధికారి యం.రాధ, సంస్థ ప్రతినిధులు మంజు, ప్రదీప్ కుమార్ రాజేష్. రెహమాన్. వీరమల్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ పట్ల నిర్లక్ష్యం తగదు

**-ఉపాధి పనుల్లో ఒకరికి బదులు ఒకరు వస్తే చర్యలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహించే నర్సరీలో మొక్కల సంరక్షణ పట్ల నిర్లక్ష్యం తగదని నేలకొండపల్లి ఎంపీడీఓ యం. యర్రయ్య సూచించారు. మండలంలోని రాజేశ్వరపురం లోని పంచాయతీ నర్సరీని పరిశీలించారు. మొక్కల పెరుగుదల గురించి అడిగి తెలుసుకున్నారు. మొక్కలకు ఎండ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి సరఫరా విషయంలో అప్రమతంగా ఉండాలని అన్నారు. లీక్ లు కాకుండా నిత్యం పర్యవేక్షణ చేయాలని అన్నారు. ప్రజలకు దాహార్తి ని తీర్చేందుకు ప్రతీ పంచాయతీలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. మస్టర్ల ను తనీఖీ చేశా రు. కూలీలను " సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాది కూలీల సంఖ్య ను మరింత పెంచాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి కూలీలలో ఒకరికి బదులు మరొకరు పని చేస్తే క్షేత్ర సహాయకుడు, పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

## యువతకు ప్రాధాన్యం కల్పించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలలో యువత కు ప్రాధా న్యత కల్పించాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహరాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని కలిసి కోరారు. ఢిల్లీలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాల ను వివరించారు. ప్రభు త్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజలల్లోకి ఇంటింటికి తీసుకెళ్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ నామినేటేడ్, పార్టీ పదవులలో కూడ యువజన కాంగ్రెస్ కు ప్రాధాన్యం కల్పిస్తే మరింతగా ప్రజలల్లోకి వెళ్లేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం తో భట్టితో పాటు పూర్తి గా పాదయాత్రలో పాల్గొన్నట్లు ఆమె కు వివరించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ కృషి ని ఆమె ప్రసంశించారు. అనంతరం జాతీయయువజన కాంగ్రెస్ అధ్యకుడు ఉదయ్ బాను షిబ్ ను కలిసి ఘనంగా సన్మానించారు.

## ఆదిమూలం శ్రీనివాస్‌కు కాంగ్రెస్ ఘన నివాళి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణం బంజారాకాలనీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆదిమూలం శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే. గురువారం ఆయన స్వగృహం నందు దశదినకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ కమిటీ నాయకులు, కార్యకర్తలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, సీనియర్ నాయకులు రంగా హన్మంతరావు, ఐలూరి సత్యనారాయణరెడ్డి, మల్లాది వాసు, కోన ధనికుమార్, పాటిబండ్ల సత్యంబాబు, దారా బాలరాజు, బాణావత్ వెంకటరమణనాయక్, టివిరెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వమే న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మం :** అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వమే న్యాయం చేయాలని రాష్ట్ర అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు యర్రాబాబు, తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల కమిటీ సమావేశం గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు, యర్రాబాబు మాట్లాడుతూ 1995లో ప్రారంభించిన అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేస్తే ఎక్కువ లాభాలు ఉంటాయని నమ్మించారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు రూ.5వేల కోట్లు వసూలు చేసి ప్రజల సొమ్ముతో పలు కంపెనీలు ప్రారంభించారని, స్థలాలు కొన్నారని, రిసార్ట్స్ నిర్మించారని వారు తెలిపారు. 2015లో డిపాజిట్ దారులకు నగదు తిరిగి ఇవ్వాల్సి వచ్చినప్పుడు అగ్రిగోల్డ్ కంపెనీ చేతులేత్తేసిందన్నారు. బాధితులు ఆందోళన చేయడంతో కంపెనీకి సంబంధించిన బాధ్యులను అరెస్టు చేసి ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నాయని వారు ఆరోపించారు. అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేసిన తెలంగాణ ప్రజల సొమ్ము రూ. 500 కోట్లు ఉంటుందని అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి బాధితులకు




న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రిని కలిసినప్పుడు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని దానిని నిలబెట్టుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గోగుల వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులు మేకల శ్రీనివాసరావు, ఇటికాల రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు ఎన్. సునీత, వీరబ్రహ్మచారి, ఎస్‌డి పాషా, లక్ష్మి నారాయణ, సతీష్, రాజు, కృష్ణయ్య, లక్ష్మి, అనసూర్య, రమాదేవి, సురేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్, ఇంటర్మీడియట్ కళాశాలలు 2025 26 విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ అన్నారు. గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్, కళాశాలల్లో అప్పుడే అడ్మిషన్లు పూర్తయినట్లు ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చెప్పడం బాధాకరమన్నారు. ముందస్తుగా చేరితే అడ్మిషన్ ఫీజులో రాయితీ అంటూ తల్లిదండ్రులను బురిటి కొట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రకరకాల పేర్లతో ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ అడ్మిషన్ల పేరుతో ప్రత్యేక దస్త్రాలు నిర్వహిస్తున్న అధికార యంత్రాంగం ఆవైపు కనెత్తి చూడటం లేదన్నారు. చెబుతున్న ఫీజు ఒకటి, వసూలు చేసే ఫీజు మరో విధంగా




ఉందని రామకృష్ణ ఆరోపించారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే అనుమతులను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖాధికారులు మొద్దునిద్ర వీడి ఇప్పటికైనా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ పక్షాన ఆందోళనలు నిర్వహిస్తామని రామకృష్ణ హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మనోజ్, గోపి, ప్రతాప్, గణేష్, రవి, రాకేష్, ఉమామహేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# సందడిగా నాగులమ్మ జాతర



**-అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తజనం**
**-నాగులమ్మ తల్లి కళ్యాణ వైభోగం**
**-అగ్నిగుండంలో నడిచే కార్యక్రమం**

**ప్రజాపక్షం/పినపాకః** మండల పరిధిలోని జానంపేట గ్రామంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన నాగులమ్మ జాతర మూడు రోజులుగా ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతుంది. గురువారం గుట్ట నుండి నాగదేవత గుడికి వచ్చే కార్యక్రమం ఎంతో అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా నాగదేవతను గోదావరి పుణ్యస్నానం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు కొనసాగాయి. అర్ధరాత్రి నాగదేవత కళ్యాణం ఎంతో అంగరంగ వైభవంగా జరగనుంది. కళ్యాణం అనంతరం అమ్మవారు అగ్నిగుండంలో నడిచే కార్యక్రమం నిర్వహిస్తామని దేవరపాల జనార్ధన్ తెలిపారు. ఆలయానికి అనేక గ్రామాల నుండి విచ్చేసిన భక్తులతో జనసంద్రంగా మారింది. అమ్మవారు దీవెనలు తీసుకున్నారు. శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించే కార్యక్రమం నిర్వహిస్తారు. శనివారం నాగులమ్మ తల్లి గుడి నుండి గుట్టకు వెళ్లే కార్యక్రమం తో జాతర ముగుస్తుంది. దూర ప్రాంతాల నుండి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగస్వాములవు తున్నారు.

# యువతను విస్మరిస్తున్న పాలకులు

**-ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధి కోసం ఆందోళన**

**ప్రజాపక్షం/కారేపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభాలో సగభాగమున్న యువతను విస్మరిస్తున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. మండల పరిధిలోని సీతారామపురంలో పునెం రామచంద్రు అధ్యక్షతన ఏఐవైఎఫ్ గ్రామశాఖ మహాసభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మద్దోజు శ్రావణ్ మాట్లాడుతూ పాలకుల వైఖరి కారణంగా దేశంలో యువశక్తి నిర్వీర్యమవుతుందని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత నైరాశ్యంలో ఉందన్నారు.యేటా రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న మోడీ కనీసం వెయ్యి ఉద్యోగాలు కూడా కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు దారాదత్తం చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వట్టిపోతున్నాయని శ్రావణ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యువకులకు ఇచ్చిన హామీని పట్టించుకోవడం లేదని కేసిఆర్ మాటల మాదిరే కాంగ్రెస్ నిరుద్యోగ భృతి కూడా అటకెక్కిందని ఆయన తెలిపారు.



ఉద్యోగ, ఉపాధి హక్కుల కోసం పోరాడాలని ఆయన కోరారు. అఖిల భారత యువజన సమాఖ్య నేతృత్వంలో యువజనోద్యమ నిర్మాణం జరగనుందని శ్రావణ్ తెలిపారు.ఈ సమావేశంలో సిపిఐ నాయకులు చిన్నంశెట్టి భూషయ్య, నాయకులు నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు బార్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాలు

**విజేతలుగా బద్దం శ్రీనివాస్ రెడ్డి, చిర్రా రవి కుమార్, యామ (దాసరి) కవిత**



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ఉదయం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి బద్దం శ్రీనివాస్ రెడ్డి 19 ఓట్లు సాధించి 3 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. జనరల్ సెక్రటరీగా చిర్రా రవి కుమార్ 23 ఓట్లు పొందగా, 4 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదే విధంగా వైస్ ప్రెసిడెంట్‌గా యామ (దాసరి) కవిత 23 ఓట్లు సాధించి, 4 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఈ ఎన్నికలకు కె. వీర మధుసూదన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

# ముత్యాలమ్మ జాతర ప్రారంభం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ అమ్మవారి వార్షిక జాతరను గురువారం ఘనంగా ప్రారంభించారు. ముత్యాలమ్మ అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు మేదూరి సాంబశివప్రసాద్ శర్మ వేదమంత్రాల నడుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తల మండల అధ్యక్షులు నారల శ్రీనివాస్ ప్రారంభించారు. విఘ్నేశ్వరపూజ, అభిషేకం, అలంకరణ, అఖండదీపారాధన, చండీపారాయణం, నివేదన, నీరాజన, మంత్ర పుష్పం, సాయంత్రం అర్చనలు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ సూర్యప్రకాశరావు ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ప్రతిజ్ఞ రచయితకు గుర్తింపు తేవాలి



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** నిత్యం విద్యార్థులు పాఠశాలల్లో ఆలపించే భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞను పైడిమర్రి వెంకటసుబ్బారావు రాశారని, ఆయన ఖమ్మం జిల్లాలో కూడా ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారని, ఎటువంటి గుర్తింపుకు నోచుకోని పైడిమర్రికి తగిన ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేయాలని రచయిత ఎం.రాంప్రసాద్ గురువారం మండల తహశీల్దార్ ఎం.ఉషా శారదకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తాను రాసిన పైడిమర్రి జీవిత చరిత్రను ఆమెకు బహుకరించారు.

# కొనసాగుతున్న పారిశుధ్య పనులు

**-పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్**



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిదిలో పారిశుధ్య పనులు పై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు కొనసాగుతున్నాయి. గురువారం మున్సిపాలిటీ పరిదిలోని 3, 5, 11 వార్డుల్లో శానిటేషన్ గ్యాంగ్ వర్క్ పనులు నిర్వహించారు. ఈ శానిటేషన్ గ్యాంగ్ వర్క్ పనులను మున్సిపల్ కమీషనర్ చింతావేణు పర్యవేక్షించారు. మున్సిపాలిటీలో పారిశుధ్య పనులపట్ల ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు రెండు రోజులుగా వార్డుల్లో శానిటేషన్ గ్యాంగ్ వర్క్ ఏవిధంగా నడుస్తుంది. ఏఏప్రాంతాల్లో నిర్వహిస్తున్నారని అనేది ప్రత్యేకంగా ఆయన సమాచారాన్ని తీసుకోవడం జరుగుతుంది. పారిశుధ్య పనులపట్ల నిర్వక్ష్యం వహించవద్దని ప్రతిరోజు వార్డుల వారీగా పనులు నిర్వహించాలని తెలిపారు. వ్యర్థపదార్థాలు రోడ్ల పక్కన ఎక్కడా డంపు చేయకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని ఆదేశించారు.

# అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రికి నలుగురు డాక్టర్లు నియామకం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రికి నలుగురు స్పెషలిస్ట్ వైద్యులను నియమించారు. ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సహకారంతో జిల్లా కలెక్టర్ జితిష్ పాటిల్ ప్రత్యేక చొరవతో డిసిహెచ్ఎస్ రవిబాబు కృషితో స్పెషలిస్టు వైద్యులను తీసుకువచ్చారు. గైన్కాలజిస్ట్ ఒకరు, ఎముకల డాక్టర్ ఒకరు మొత్తం నలుగురు వైద్యులు నియమించారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ రుక్మిణి తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 184502 మెట్రిక్ టన్నులు కాగా అందులో సన్న రకాలు 99729 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకాలు 144 మెట్రిక్ టన్నులు ధాన్యం వస్తుందనే అంచనాలు ఉన్నాయని, ఇందు కోసం 144 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2320,బి గ్రేడ్‌కు రూ.2300 మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎవ్వరూ వడదెబ్బకు గురికాకుండా చలువ పందిళ్లు, టెంట్లు, మంచినీటి సదుపాయాన్ని కల్పించాలన్నారు. క్రాప్ బుకింగ్ చేసిన ప్రకారం రైతులకు టోకెన్లు జారీ చేయడం ద్వారా రద్దీ తగ్గుతుందన్నారు. జిల్లా సమీప రాష్ట్రాల నుండి ధాన్యం తరలివచ్చే అవకాశం ఉన్నందున సరిహద్దుల్లో మొత్తం 8 చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఏరోజుకారోజు ఆన్‌లైన్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సెంటర్ ఇంచార్జ్, మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులంతా వారివారి విధులు తప్పకుండా నిర్వహించాలని, ఎలాంటి లోపాలు తలెత్తినా తనకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ త్రినాధ్, రుక్మిణి, తునికలు కొలతలు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# వద్దిరాజుకు ధన్యవాదాలు తెలిపిన ఐజెయు

**ప్రజాపక్షం/ఖమ్మం :** పార్లమెంటులో జర్నలిస్టులకు రాయితీపై రైల్వే పాసులు జారీ చేయాలని గతంలో ఉన్న పథకాన్ని పునరుద్ధరించాలని కోరిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మంజిల్లా కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. కరోనా మహమ్మారికి ముందు అక్రిడేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు రైలులో ప్రయాణిస్తే 50 శాతం రాయితీ ఉండేదని కరోనా అనంతరం ఆ రాయితీని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసిందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తెలిపారు. రద్దయిన 50 శాతం రాయితీ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఐదేండ్లుగా టియుడబ్ల్యూజె (ఐజెయు) ఎంపిలకు విజ్ఞప్తులు చేసిందన్నారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, రేణుకాచౌదరి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి తో పాటు ఖమ్మం వచ్చిన ఎంపి రఘునందన్‌రావు కు సైతం వినతి పత్రాలు అందించడం జరిగిందన్నారు. ఐజెయు విజ్ఞప్తిని మన్నించి రాజ్యసభలో జర్నలిస్టుల పాసుల పునరుద్ధరణమై మాట్లాడిన వద్దిరాజు రవిచంద్రకు జిల్లా కమిటీ తరుపున వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/భద్రాచలం :** జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఈబిసి, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆర్థికాభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికంగా స్థిరపడవచ్చన్నారు. 21 సం. నుండి 55 సం.ల వారి వరకు ఈ పథకానికి అర్హులని, దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని చెప్పారు.

# లారీలను రోడ్డు మీద పార్కింగ్ చేయవద్దు : డిఎస్పీ




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు డిఎస్పీ ఆఫీసులో మణుగూరు నుండి బీటీపీఎస్ కు వెళ్ళు మార్గంలో ఏర్పడుతున్న ట్రాఫిక్ దృష్ట్యా గురువారం ఉదయం డిఎస్పి రవీందర్ రెడ్డి స్థానిక బి టి పి ఎస్ కోల్ ట్రాన్స్పోర్ట్ ఆర్ఐ, సింగరేణి సంస్థ ఎస్ఓ, గోల్డ్ ట్రాన్స్పోర్ట్ చేస్తున్న లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ మరియు మెంబర్స్ తోటి ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ పలు సూచనలు చేశారు. బిటిపిఎస్ గేట్ నుండి 400 మీటర్ల వరకు ఇరువైపులా రోడ్డుకి లారీలు పార్కింగ్ చేయకుండా వారికి ప్రత్యేకంగా ఒక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని చెప్పడం జరిగింది. అందుకుగాను బీటీపీఎస్ వారు దానికి అంగీకరించి రోడ్డుమీద పార్కింగ్ చేయకుండా రోడ్డుకి ఇరువైపులా 400 మీటర్ల వరకు ప్రత్యేకంగా వాహనాలు నింపుకోవడానికి పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా లారీ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ వాళ్లకు రాజుపేట క్రాస్ రోడ్ వద్ద నుండి సింగరేణి బొగ్గు లారీలకు అడ్డుగా ఏర్పడకుండా అక్కడ పార్కింగ్ చేయవద్దని వారికి సూచించిన పార్కింగ్ ప్లేస్ లోనే వాహనాలని పార్కింగ్ చేయాలని రోడ్డుమీద ఎట్టి పరిస్థితుల్లో వాహనాలను పార్కింగ్ చేయరాదని చెప్పడం జరిగింది. ఒకవేళ పార్కింగ్ చేసినట్లయితే వారిపై చట్ట రీత్యా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు కలకుండా ట్రాఫిక్ ను సరైన రీతిలో వెళ్లేలా చూడాలని లారీ అసోసియేషన్ మెంబర్స్ కు చెప్పడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు కొత్తగా మణుగూరులో ఇసుక రీచ్ లో నుండి నిత్యం చాలా లారీలు వెళ్తుంటాయి కావున దయచేసి ప్రజలకు మరియు వాహనాలకు ఇబ్బంది కలగకుండా లారీలను రోడ్డు మీద పార్కింగ్ చేయవద్దని పోలీసులకు సహకరించాలని లేనియెడల చట్టరీత్యా తీవ్రమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి సంస్థ నుండి శ్రీనివాస్ ఎస్ ఓ, బి టి పి ఎస్ నుండి కొల్ ట్రాన్స్‌పోర్ట్ డి నాయుడు, లారీ అసోసియేషన్ 14 టైర్స్, 12 టైర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలను కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/బోనకల్ :** మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్నలను కొనుగోలు చేయాలని, మొక్కజొన్నలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. గురువారం ముష్టికుంట గ్రామంలో ఏఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కర్‌రావు తో కలిసి కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్నలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఇప్పటికే మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న వడ్లకు ఇప్పటికీ ప్రభుత్వం బోనస్ ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, జయరాజు, రామారావు, సత్యం, బాబురావు తదితరులున్నారు.

# ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులను మంజూరు చేయాలి

**-తహసీల్దార్‌కు మాస్ లైన్ వినతి**



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండలంలో పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్లు తక్షణమే మంజూరు చేయాలని, బోధకాలు బాధితులకు వికలాంగులుగా గుర్తించాలని, కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని ఎన్నికల నాడు పెన్షన్లు పెంచుతానన్న ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కారేపల్లి కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శులు గుమ్మడి సందీప్, ఎన్వి రాకేష్‌లు డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కమిటీ పిలుపులో భాగంగా మాస్ లైన్ సంయుక్త మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులు ఆసరా పెన్షన్లు తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ గురువారం కారేపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పాషాకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కారేపల్లి, కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శులు కుమ్మరి సందీప్, ఎన్వి రాకేష్‌లు మాట్లాడుతూ పెంచి ఇస్తామన్న పెన్షన్ కూడా ఇంత వరకు అమలు చేయలేదని, ఖమ్మం జిల్లాలకు బలమైన ముగ్గురు మంత్రులు ఉండి ఏం ప్రయోజనం అని ప్రశ్నించారు. బడ్జెట్‌లో నిధులు పెంచకపోగా చేయుటకు ఇవ్వాల్సిన నిధులను ఇతర రంగాలకి మార్చి ఈ బాధితులను అన్యాయం చేయటం ఏమిటని వారు ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెన్షనర్ దారులందరికి నూతన పెన్షన్లను, కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాస్ లైన్ మండల నాయకులు పులకాని సత్తిరెడ్డి, వేములపల్లి వీరన్న, కొయ్యల శ్రీను, తాటి పాపారావు, చల్లా రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాపులను పరిశీలించిన డిఎస్‌వో



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రేషన్ షాపులను జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కె. చందన్‌కుమార్ పరిశీలించారు. గురువారం ఖమ్మం నగరంలోని సారధినగర్‌లో రెండు రేషన్ దుకాణాలను, బొక్కలగడ్డలో ఉన్న రేషన్ దుకాణాన్ని ఆయన పరిశీలించారు. ఆయా దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలించి రికార్డు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నుంచి ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనుందని ఆయన తెలిపారు. అన్ని రేషన్ దుకాణాలకు సన్న బియ్యాన్ని సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి సన్న బియ్యం సరఫరాకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిటి విజయ్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 29న దుకాణ సముదాయాల అద్దెకు వేలం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల ప్రజాపరిషత్ ఆధీనంలో ఉన్న వీడీవో క్వార్టర్స్, లక్ష్మి మహిళా మండలి కాంప్లెక్స్ లను అద్దెకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య తెలిపారు. గురువారం తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో ఉన్న మూడు వీడీవో క్వార్టర్స్, రెండు మహిళా మండలి దుకాణ సముదాయములను ఈ నెల 29న అద్దె కు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025 26, మరియు 202627 సంవత్సరాలకు గాను, అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. కావునా వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

